PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :125 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : మంగళవారం - 20 అక్టోబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:125 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: TUESDAY 20 OCTOBER 2026 PAGES: 04 RS:01/



పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

విజయ దశమి శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (21 అక్టోబర్ బుధవారం) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం గురువారం)

స్థానిక ఎన్నికల

సమరానికి సిద్ధం




బీసీలకు 35.05 శాతం సీట్లు కేటాయించాం!

హింస, దౌర్జన్యాలకు తావులేదు.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలి

మహిళలు, యువతకు ప్రాధాన్యం.. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి పెద్దపీట

వైసీపీ తీరుపై సీఎం చంద్రబాబు విమర్శలు.. దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



అమరావతి,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతోపాటు అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో హింస, దౌర్జన్యాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ నిర్ణయా న్ని వెల్లడించే వాతా వరణం ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు బెదిరింపులకు పాల్పడినా, దాడులు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. **బీసీలకు 35.05 శాతం సీట్లు కేటాయింపు** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించినట్లు చంద్రబాబు వెల్లడించారు. మిగతా2లో...

ఏపీలో స్థానిక ఎన్నికల

నగారా!

నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్

10,488 స్థానాలకు ఎన్నికలు.. ఈ నెల 21 నుంచి నామినేషన్లు

అమరావతి, 19(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 659 మండలాల్లోని 9,829 ఎంపీటీసీ, 659 జెడ్పీటీసీ స్థానాలకు కలిపి మొత్తం 10,488 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మిగతా2లో...

రూ.4.75 కోట్ల రోడ్డు ధ్వంసం..

బాధ్యులపై కఠిన చర్యలు!

నాన్ బెయిలబుల్ కేసులు పెట్టండి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



రూ.2,650 కోట్లతో అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్

14 నెలల్లోనే నిర్మాణం పూర్తి.. 2,650 మందికి ఉపాధి అవకాశాలు

పర్యావరణహితంగా, హరిత విద్యుత్‌తో నిర్వహణ



అమరావతి,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోటలో రూ.2,650 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. శంకుస్థాపన చేసినప్పటి నుంచి కేవలం 14 నెలల్లోనే ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయడం విశేషమని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 650 మందికి, పరోక్షంగా మరో 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా 2,650 మందికి ఉపాధి కలగనుంది. మిగతా2లో...

యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

● సైనిక శిక్షణ శిబిరంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపాటు ● 200 మందికి పైగా గాయాలు



షబ్వా, అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): యెమెన్‌లో మరోసారి హింస చెలరేగింది. ప్రభుత్వ భద్రతా దళాల శిక్షణ శిబిరంపై హౌతీ తిరుగుబాటు దారులు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం 53 మంది మృతి చెందగా, మరో 200 మందికి పైగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లో సోమవారం ఈ దాడి జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో మూడు క్షిపణులు శిబిరాన్ని తాకినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హౌతీ ప్రతినిధులు దాడికి బాధ్యత ప్రకటిస్తూ, ఆ శిబిరంలో సౌదీ అధికారుల ఆధ్వర్యంలోని బలగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించి వారు ఆధారాలు వెల్లడించలేదు. మిగతా2లో...



అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా


- ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, 19(నేటి మినిట్ టు మినిట్): అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, మిగతా2లో...

ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

- ట్రంప్, జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక భేటీకి పుతిన్ ప్రతిపాదన

- నవంబర్‌లో శిఖరాగ్ర సమావేశానికి యత్నాలు



కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!

కొండపోచమ్మ సాగర్ నీటి మళ్లింపుపై ఆరోపణలు

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు తొలగించాలని డిమాండ్





పారామిలిటరీ బలగాల

పిటిషన్ కొట్టివేత

- వైసీపీ అప్పీల్‌ను తోసిపుచ్చిన ఏపీ హైకోర్టు

స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ తరఫున బీసీలకు 35.05 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. మహిళలు, యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించామని చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో కేవలం రాజకీయ సమీకరణలకే పరిమితం కాకుండా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణతోపాటు ఫోన్ కాల్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, స్థానిక నాయకత్వాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. **హింసాత్మక రాజకీయాలను సహించేది లేదు** స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం హింస, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే విధానాలను సహించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో కుప్పం, పుంగనూరు, పులివెందుల ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ తీరుపై విమర్శలు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లతో హడావుడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని, బలప్రయోగంతో రాజకీయ ఆధిపత్యం సాధించాలనే ఆలోచనలను విడనాడాలని సూచించారు. **జగన్ తీరుపై విమర్శలు** ఎన్నికల సంఘం వద్ద వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపైనా చంద్రబాబు విమర్శలు చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు ప్రయత్నించాలని సూచించారు. **ప్రత్యక్ష ఎన్నికల విధానంతో పారదర్శకత** మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడం ద్వారా స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని భావిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ విధానం ద్వారా ఎన్నికల అనంతరం జరిగే రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థలు ప్రజలకు మరింత జవాబుదారీగా పనిచేసేలా వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. **ప్రశాంత ఎన్నికలే లక్ష్యం** ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. నామినేషన్ల నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలన్నీ సంయమనం పాటించాలని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన అంశాల ఆధారంగా ప్రజల తీర్పును కోరుతున్నామని తెలిపారు. ఎన్నికల పోటీ రాజకీయంగా ఉండాలి తప్ప వ్యక్తిగత దాడులు, బెదిరింపులు, హింసకు వేదిక కాకూడదని పేర్కొన్నారు.**ప్రజాస్వామ్యమే గెలవాలి** స్థానిక సంస్థలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కీలకమని, వాటి ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా జరగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. బీసీలు, మహిళలు, యువతకు అవకాశాలు కల్పిస్తూ అన్ని వర్గాల భాగస్వామ్యంతో ప్రజాప్రతి నిధులను ఎన్నుకోవడం ద్వారా స్థానిక పాలన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఎన్ని కల్లో అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుం టామని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వ హించడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

మాస్కో,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించా యి. ఉక్రెయిన్‌తో వివాదంపై చర్చించి, రష్యాకు అనుకూలమైన శాంతి ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో వచ్చే నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు సమాచారం.అక్టోబర్ 9న ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణలో పుతిన్ ఈ ఆలోచనను ప్రస్తావించినట్లు నివేదిక పేర్కొంది. నవంబర్ 18, 19 తేదీల్లో చైనాలోని షెన్‌జెన్‌లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా ఈ చర్చలు నిర్వహించే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఈ సమావేశానికి ట్రంప్ ఇంకా అధికారికంగా అంగీకరించలేదు. చైనా కూడా ట్రంప్ పాల్గొంటే అభ్యంతరం ఉండబోదని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.ఈ ప్రతిపాదనపై ఉక్రెయిన్, అమెరికాయూరోపియన్ దేశాల మిత్రపక్షాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యంగా శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు, రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, త్రైపాక్షిక సమావేశం ఖరారైందా, దాని ద్వారా ఒప్పందం కుదురుతుందా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

హైదరాబాద్, 19(నేటి మినిట్ టు మినిట్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్‌కు కొండపోచమ్మ సాగర్ నీటిని మళ్లించారంటూ వస్తున్న ఆరోపణలపై రాజకీయ వివాదం ముదురుతోంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ న్యాయ విభాగం నోటీసులు జారీ చేసింది.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయ విభాగం ఇన్‌ఛార్జి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే ఓ తెలుగు దినపత్రిక యాజ మాన్యానికి, సంపాదకుడికి నోటీసులు పంపించినట్లు పార్టీ వెల్లడించింది.సంబంధిత ఆరోపణలతో తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో చేసిన పోస్టులను వెంటనే, బేషరతుగా తొలగించాలని, ఆరోపణలను ఉపసంహరించుకో వాలని ముగ్గురు కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ న్యాయ విభాగం కోరింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నాలను సహిం చబోమని హెచ్చరించింది.నోటీసులకు స్పందించక పోతే పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతల స్పందన, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు తదుపరి పరిణామాల్లో కీలకం కానున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయం ఖాయం!

- కలిసికట్టుగా పనిచేసి భారీ మెజార్టీ సాధించాలి
- కూటమిలో సమన్వయంతో ముందుకు సాగాలి: మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. ఏలూరులో తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఆదివారం స్థానిక హోటల్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన సమన్వయకర్తలు పత్సమట్ల ధర్మరాజు, నారా శేషు, మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మనోహర్ తెలిపారు. గత ఎన్నికల్లో కూటమిపై నమ్మకంతో ప్రజలు మద్దతు ఇచ్చారని, అదే ఐక్యతను కొనసాగిస్తూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీల మధ్య వ్యక్తిగత అభిప్రాయభేదాలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు సముచిత గుర్తింపు కల్పిస్తామని పేర్కొన్నారు.రాబోయే పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఏలూరు జిల్లా నుంచే 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని, దేవదాయ శాఖ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు.టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కార్యకర్తల కష్టాన్ని గుర్తించి, పరిస్థితులకు అనుగుణంగా సీట్ల కేటాయింపులు చేపట్టామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, సీనియర్ నేత అంబికా కృష్ణ, గూడవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పారామిలిటరీ బలగాల పిటిషన్ కొట్టివేత

- వైసీపీ అప్పీల్‌ను తోసిపుచ్చిన ఏపీ హైకోర్టు

అమరావతి,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పారామిలిటరీ బలగాలను మోహరించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు కేంద్ర సాయుధ బలగాలను కేటాయించాలంటూ ఆ పార్టీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.గతంలో ఇదే అంశంపై సింగిల్ జడ్జి విచారణ జరిపి పిటిషన్‌ను కొట్టివేశారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. వెకేషన్ బెంచ్ ఎదుట జరిగిన విచారణలో ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన ధర్మాసనం, పారామిలిటరీ బలగాల మోహరింపును కోరుతూ దాఖలైన అప్పీల్‌ను తిరస్కరించింది.స్థానిక ఎన్నికల భద్రతకు పారామిలిటరీ బలగాల అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. పశ్చిమ బెంగాల్‌లోని పరిస్థితులను ఆంధ్రప్రదేశ్ పరిస్థితులతో పోల్చలేమని పేర్కొంది. ఈ వాదనల నేపథ్యంలో హైకోర్టు వైసీపీ అప్పీల్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

ఏపీలో స్థానిక ఎన్నికల నగారా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 21 నుంచి నామినేషన్లుఅక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. తిరస్కరణకు గురైన నామినేషన్లపై 25న అప్పీళ్లు చేసుకోవచ్చు. 26న అప్పీళ్లను పరిష్కరిస్తారు. అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

నవంబర్ 3న పోలింగ్.. 5న ఫలితాలుఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నవంబర్ 3న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అవసరమైన ప్రాంతాల్లో నవంబర్ 4న తిరిగి పోలింగ్ చేపడతారు. నవంబర్ 5న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అభ్యర్థులు నిర్దిష్ట గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాలని, ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించింది.

రూ.4.75 కోట్ల రోడ్డు ధ్వంసం.. బాధ్యులపై కఠిన చర్యలు!

అమరావతి,19(నేటి మినిట్ టు మినిట్): ప్రజాధనంతో నిర్మించిన రహదారిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతోపాటు, జరిగిన నష్టాన్ని వారినుంచే వసూలు చేయాలని సూచించారు.పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.4.75 కోట్లతో వారం రోజుల క్రితం నిర్మించిన రోడ్డులో దాదాపు 100 మీటర్ల మేర ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామస్థుల సమాచారం మేరకు ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు.ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చును బాధ్యుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఘటనకు బాధ్యులైన వారితోపాటు వారికి సహకరించినవారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రూ.2,650 కోట్లతో అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలకు ఈ ప్లాంట్ మరింత ఊతమివ్వనుంది.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఈ పరిశ్రమను రూపొందించారు. ప్లాంట్ నిర్వహణకు భూగర్భ జలాలను వినియోగించకుండా, వందశాతం హరిత విద్యుత్‌తో నడిచేలా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. గాలి, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులతో పాటు వ్యర్థ ఉష్ణం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వ్యవస్థలు కూడా ఇందులో ఉన్నాయి. ప్లాస్టిక్, పురపాలక వ్యర్థాలను ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే ఏర్పాట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్పత్తి వ్యవస్థలు ప్లాంట్‌లో ఉన్నాయి. పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికులకు ఉపాధి కల్పించడం, పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పెట్నికోటలో అల్ట్రాటెక్ సిమెంట్ ప్లాంట్ ప్రారంభం ఈ దిశగా కీలక పరిణామంగా నిలవనుంది.

యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

(మొదటి పేజీ తరువాయి)

యెమెన్‌లో ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. గతంలో కొనసాగిన కాల్పుల విరమణ ఒప్పందం విచ్ఛిన్నం కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజా దాడితో ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి.

అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.దసరా పండుగ ధైర్యం, ధర్మం, సత్యం, ఐక్యత, ఆత్మవిశ్వాసం వంటి విలువలను నేర్పుతుందని సీఎం పేర్కొన్నారు. అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి ప్రతికూల భావాలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణుడిపై శ్రీరాముడి గెలుపు ధర్మానికి ఉన్న శక్తిని చాటిచెబుతాయని తెలిపారు. తెలంగాణలో జమ్మిచెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించి ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు ప్రకృతిని గౌరవించడం, పెద్దలను ఆదరించడం నేర్పుతాయని పేర్కొన్నారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అభివృద్ధి, విజయాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి,అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా పండుగ సందేశాన్ని అందించారు.రైతుల శ్రమకు తగిన ఫలితం అందించడం, మహిళలకు సాధికారత కల్పించడం, యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి జగన్మాత ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దీవెనలతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

‘అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ... ఎన్నికలయ్యాక అండర్‌గ్రౌండ్‌లోక...?‘

● మేయర్ పీఠం బీజేపీకి.. మంటలు టీడీపీలోనా? ● జెండా మోసింది మేము.. జేబులు నింపేది మీరా? ● కూటమి కుర్చీ పంచుకుంది.. కార్యకర్తకు కంగారు మిగిలింది ● మేయర్ పీఠంపై కన్ను.. తమ్ముళ్ల గుండెల్లో మంట ● టికెట్ ఒకరికి.. తలనొప్పి వందమందికి ● పార్టీ కోసం కష్టపడితే పోస్టర్లు.. పదవులొచ్చేసరికి పక్కకు? ● మేయర్ సీటు బీజేపీకి.. అసంతృప్తి టీడీపీకి ● కూటమిలో కుర్చీల పంచాయితీ.. కార్యకర్తకు కన్నీటి కథ ● జెండా మోసినోడికి మొండి చేయి.. కొత్తగా వచ్చినోడికి బీఫారం ● ఏళ్ల తరబడి సేవలు.. చివరికి టికెట్ కోసం తిప్పలు ● ఓట్లప్పుడు కార్యకర్త దేవుడు.. పదవులప్పుడు కనిపించడేంటి? ● కూటమి లెక్కలు అదుర్స్.. కార్యకర్తల లెక్కలు తారుమారు ● పదవుల పందేరంలో పెద్దల పండగ.. కిందిస్థాయి నేతలకు దండగ ● టికెట్ల దగ్గర తగాదాలు.. గెలుపు దగ్గర గుబులు ● మేయర్ కుర్చీ కోసం మల్లగుల్లాలు.. కార్యకర్తలకు మిగిలేది ప్రశ్నలే ● డ్రైనేజీ భూమిలోనే.. హామీలు మాత్రం ఆకాశంలో ● ఎన్నికలొస్తే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ.. ఎన్నికలయ్యాక అండర్‌గ్రౌండ్‌లోకే ● డంపింగ్ యార్డు దుర్వాసన.. హామీలకు మాత్రం సువాసన ● డ్రైనేజీ ఎప్పుడొస్తుందో దేవుడికెరుక.. హామీ మాత్రం ప్రతి ఎన్నికకూ పక్కా ● అనంత సమస్యలు అనంతం.. నాయకుల హామీలకు అంతమే లేదు



అనంతపురం, అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్ ప్రతినిధి): అనంతపురం నగర రాజకీయాల్లో మేయర్ పదవి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కూటమి పార్టీల మధ్య పదవుల పంపకం, ఆశావహులకు టికెట్ల కేటాయింపు, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకు దక్కుతున్న ప్రాధాన్యత వంటి అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కూటమిలో భాగంగా మేయర్ పదవిని బీజేపీకి కేటాయించారనే అంశంపై టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు ఇదేనా?

పార్టీ జెండా మోస్తూ, ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరుగుతూ, వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదనే ఆవేదన టీడీపీ వర్గాల్లో వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. కొందరు నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిగత వనరులతో ప్రజలకు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీకి మంచి పేరు తీసుకురావడానికి ప్రయత్నించామని, ఇప్పుడు కీలక పదవుల విషయంలో తమను పక్కన పెడుతున్నారనే అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా, కొత్తగా తెరపైకి వచ్చిన వారికి అవకాశాలు కల్పిస్తే క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై పార్టీ నాయకత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది.

బీఫారాల కోసం ఎదురుచూపులు.. ఇండిపెండెంట్లుగా బరిలోకి ఆశావహులు

ఎన్నికల వేళ టికెట్ల కేటాయింపు రాజకీయ పార్టీలకు ఎప్పుడూ సవాలుగానే ఉంటుంది. అనంతపురంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందనే చర్చ సాగుతోంది. పార్టీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్న కొందరు ఆశావహులకు అవకాశం దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ సమీకరణాలను ఆసక్తికరంగా మార్చింది. ముఖ్యంగా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగుతున్న వారిలో టీడీపీతో అనుబంధం ఉన్న నాయకులు, కార్యకర్తలు కూడా ఉన్నారనే సమాచారం చర్చకు దారితీస్తోంది. ఇదే నిజమైతే అధికార కూటమి అభ్యర్థుల ఓట్లపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే స్వతంత్రంగా నామినేషన్ వేసిన ప్రతి ఒక్కరూ అధికారికంగా టీడీపీకి చెందినవారేనని నిర్ధారించలేం. అభ్యర్థుల రాజకీయ నేపథ్యం, నామినేషన్ల ఉపసంహరణ తర్వాతే వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

బీజేపీకి మేయర్ పీఠం.. టీడీపీ, జనసేన శ్రేణుల వైఖరి ఏమిటి?

కూటమి రాజకీయాల్లో భాగంగా బీజేపీకి మేయర్ పదవి కేటాయించారనే అంశం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పదవుల పంపకంలో ఒక పార్టీకి అవకాశం దక్కినప్పుడు, మిగిలిన పార్టీల్లోని ఆశావహులు, స్థానిక నాయకులు ఎలా స్పందిస్తారనేది కీలకంగా మారుతుంది. బీజేపీ అభ్యర్థి విజయానికి టీడీపీ, జనసేన శ్రేణులు ఎంతవరకు సమన్వయంతో పనిచేస్తాయన్నది ఇప్పుడు చర్చనీయాంశం. బహిరంగంగా కూటమి ఐక్యతను ప్రదర్శించినా, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు అదే ఉత్సాహంతో పనిచేస్తారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంతర్గత అసంతృప్తి కొనసాగితే ప్రత్యర్థి పార్టీలకు రాజకీయంగా లాభం చేకూరే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కూటమి నేతలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తే ఈ అసంతృప్తిని అధిగమించవచ్చనే అభిప్రాయమూ ఉంది.

కొత్త ముఖాలకు అవకాశాలు.. పాత నాయకుల పరిస్థితి ఏమిటి?

ఏళ్ల తరబడి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని పక్కనపెట్టి, ఎన్నికల సమయంలో కొత్తగా తెరపైకి వచ్చిన వారికి టికెట్లు ఇస్తున్నారనే విమర్శలు కొన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తకు గుర్తింపు దక్కాలంటే కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం వారి సేవలను గుర్తించాలని కార్యకర్తలు కోరుతున్నట్లు తెలుస్తోంది. టికెట్ల కేటాయింపులో డబ్బు ప్రభావం పెరిగిందనే ఆరోపణలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారించిన ఆధారాలు అందుబాటులో లేవు. పార్టీలు అభ్యర్థులను ఎంపిక చేసే విధానం, స్థానిక నాయకత్వం అనుసరిస్తున్న ప్రమాణాలపై స్పష్టత ఇస్తే ఈ వివాదానికి కొంతవరకు తెరపడే అవకాశం ఉంది.

మేయర్ పీఠం కోసం రంగంలోకి దిగుతున్న ముఖ్య నేతలు

అనంతపురం మేయర్ పదవి కేవలం ఒక స్థానిక పదవిగా కాకుండా, నగర రాజకీయాలపై పట్టును నిరూపించుకునే అవకాశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఎన్నికల పరిణామాలపై దృష్టి సారిస్తున్నారనే చర్చ సాగుతోంది. మేయర్ పదవిని దక్కించుకోవడం ద్వారా తమ రాజకీయ ప్రభావాన్ని చాటుకోవాలని వివిధ పార్టీల నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటే, చివరి నిమిషం వరకు రాజకీయ సమీకరణాలు మారే అవకాశముంది. అయితే మేయర్ పదవి ఎవరికి దక్కుతుందనేది కేవలం ప్రచారంతోనే తేలిపోదు. అభ్యర్థుల బలం, పార్టీల మధ్య సమన్వయం, వార్డు స్థాయిలో ఓటర్ల మద్దతు, ఎన్నికల నిబంధనల ప్రకారం జరిగే ప్రక్రియ వంటి అంశాలే తుది ఫలితాన్ని నిర్ణయిస్తాయి.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ హామీ.. ఎప్పటికి సాకారం?

రాజకీయంగా మేయర్ పదవిపై పోటీ కొనసాగుతుండగా, అనంతపురం నగర ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న మౌలిక సమస్యలపై కూడా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, డంపింగ్ యార్డు నిర్వహణ, పారిశుద్ధ్యం వంటి అంశాలు ఎన్నికల సమయంలో ప్రధాన హామీలుగా వినిపిస్తున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ నగర అభివృద్ధి, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుదల, చెత్త నిర్వహణ వంటి అంశాలపై హామీలు ఇచ్చినా, వాటి అమలు విషయంలో ప్రజలకు స్పష్టమైన పురోగతి కనిపించాలనే డిమాండ్ పెరుగుతోంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం పెద్ద మొత్తంలో నిధులు, సమగ్ర ప్రణాళిక, సాంకేతిక అనుమతులు, దశలవారీ అమలు వంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా, ప్రాజెక్టు అంచనా వ్యయం ఎంత? నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తారు? పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఎప్పటికి పూర్తవుతాయి? అనే వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. అదేవిధంగా డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, చెత్త సేకరణ నుంచి శుద్ధి, పారవేత వరకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం నగర పాలక సంస్థ ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటి.

రమేష్ గౌడ్ బరిలోకి దిగితే మారనున్న సమీకరణాలా?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రమేష్ గౌడ్ బరిలోకి దిగుతున్నారనే ప్రచారం నేపథ్యంలో అనంతపురం రాజకీయాల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారిందనే చర్చ సాగుతోంది. ప్రత్యర్థి అభ్యర్థి బరిలో ఉండటం, కూటమిలోని అంతర్గత అసంతృప్తి, స్వతంత్ర అభ్యర్థుల పోటీ వంటి అంశాలు ఎన్నికల లెక్కలను ప్రభావితం చేయవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ సజావుగా జరిగితే ఒక విధమైన ఫలితం రావచ్చు. అదే సమయంలో టికెట్లు దక్కని ఆశావహులు స్వతంత్రంగా పోటీ చేయడం లేదా స్థానిక స్థాయిలో అసంతృప్తి కొనసాగడం జరిగితే మరో విధమైన రాజకీయ పరిస్థితి ఏర్పడవచ్చు. అయితే ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు అనే అంశంపై ఇప్పుడే తుది అంచనాకు రావడం తొందరపాటే. అభ్యర్థుల అధికారిక వివరాలు, ఎన్నికల ప్రచారం, పార్టీ నాయకత్వాల వ్యూహాలు, ఓటర్ల స్పందన ఆధారంగా మాత్రమే పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రజలకు కావాల్సింది పదవుల పోటీ కాదు.. అభివృద్ధి

అనంతపురం నగరంలో మేయర్ పదవి చుట్టూ రాజకీయ పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, ప్రజలకు మాత్రం తమ సమస్యలకు పరిష్కారం కావాలనే ప్రధాన ఆకాంక్ష ఉంది. డ్రైనేజీ సమస్యలు, పారిశుద్ధ్యం, రహదారులు, చెత్త నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఎన్నికల్లో ఇచ్చే హామీలు ఆచరణలోకి రావాలని నగరవాసులు కోరుకుంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడం, కూటమి పార్టీల మధ్య సమన్వయం కొనసాగించడం, ప్రజలకు ఇచ్చిన హామీలను గడువులోగా అమలు చేయడం వంటి అంశాలు కొత్త పాలకుల పనితీరుకు కొలమానాలుగా నిలవనున్నాయి.

కార్యకర్తల అసంతృప్తి మేయర్ పీఠానికి ముప్పుగా మారుతుందా?

అనంతపురం రాజకీయాల్లో ప్రస్తుతం వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఇదే. మేయర్ పదవి కేటాయింపుపై అసంతృప్తి, టికెట్లు దక్కని ఆశావహుల నిర్ణయాలు, స్వతంత్ర అభ్యర్థుల బరిలోకి దిగడం వంటి అంశాలు కూటమి పార్టీలకు సవాలుగా మారే అవకాశం ఉంది. అయితే ఈ పరిణామాలు నిజంగా ఎన్నికల ఫలితాలపై ఎంత ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పలేం. అసంతృప్త నేతలను బుజ్జగించి, కార్యకర్తలకు భరోసా ఇచ్చి, పార్టీల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయగలిగితే కూటమి పరిస్థితిని చక్కదిద్దుకునే అవకాశం ఉంది. మరోవైపు అసంతృప్తి కొనసాగితే ప్రత్యర్థి పార్టీలకు అది రాజకీయ అవకాశంగా మారవచ్చు. మొత్తానికి.. అనంతపురం మేయర్ పీఠం చుట్టూ సాగుతున్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. కార్యకర్తల అసంతృప్తికి పార్టీలు పరిష్కారం చూపుతాయా? కూటమి ఐక్యత ఓట్లుగా మారుతుందా? నగర ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి హామీలు కార్యరూపం దాలుస్తాయా? అన్న ప్రశ్నలకు రానున్న రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

అనంతపురం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధ పూజ

అనంతపురం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధ పూజ

జిల్లా ప్రజలు, పోలీసులకు సుఖశాంతులు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్







అనంతపురం, అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్ ప్రతినిధి): అనంతపురం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ పోలీసు ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత చిత్రపటాలు, ప్రతిమలకు పూజలు చేసి జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బంది సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలో విధుల నిర్వహణకు వినియోగించే వివిధ రకాల ఆయుధాలకు, మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని వాహనాలకు పూజలు నిర్వహించారు. పోలీసు విధుల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేలా దుర్గామాత ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందితో పాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది తమ దైనందిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. జిల్లా పోలీసులకు విధి నిర్వహణలో విజయాలు చేకూరాలని, ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ ఏఎస్పీ అశ్విన్ మణిదీప్ ఐపీఎస్, డీఎస్పీలు కరుణాకరరావు, నీలకంఠేశ్వరరెడ్డి (ఏఆర్), డీపీఓ ఏఓ రవిరాంనాయక్, సీఐలు క్రాంతికుమార్, వలీబాషా, ఆర్ఐలు మధు, పవన్ కుమార్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు త్రిలోకనాథ్, ఆర్ఎస్ఐలు జాఫర్, లక్ష్మీనారాయణ, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.







జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సుఖసంతోషాలు నింపాలి



పుట్టపర్తి, అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్ ప్రతినిధి): శ్రీసత్యసాయి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి ఇళ్లలో వెలుగులు నింపాలని, ప్రజలు తమ లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, ఆశలను, విజయాలను నింపాలని కోరుకున్నారు. శ్రీ కనక దుర్గమ్మ ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయు రారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దసరా పండుగను ఆనందో త్సాహాల మధ్య, శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలనా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రజల సహకారంతో శ్రీసత్యసాయి జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల వ్యవస్థను ఖూనీ చేశారు

వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

పులివెందులలో నామినేషన్ల నిరోధం,వైఎస్ అవినాష్‌రెడ్డిపై కాల్పుల యత్నం దారుణం

సూపర్-6 హామీలు అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు



కడప అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను అధికార కూటమి పూర్తిగా భ్రష్టు పట్టించిందని,ప్రజాస్వామ్య వ్యవస్థలనే పనికిరాని విధంగా మార్చేశారని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు నుంచి కడప వరకు అరాచక సంస్కృతిని విస్తరించారని,అధికారుల అండదండలతో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.కడపలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూపులివెందులలో రెండో రోజు 18 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సి ఉండగా అధికార యంత్రాంగం అడ్డంకులు సృష్టించిందని సతీష్ రెడ్డి ఆరోపించారు.స్వయంగా ఎస్పీ మధ్యాహ్నం 1:30 గంటలకు రమ్మని హామీ ఇచ్చి,తీరా అక్కడికి వెళ్లాక అభ్యర్థులను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు.ఈ దౌర్జన్యాలను నిరసిస్తూ వైఎస్సార్సీపీ నేత,ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతుంటే ఎంపీ పై కాల్పులు జరిపే స్థాయికి దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు.రాయచోటిలో గడికోట శ్రీకాంత్ రెడ్డిపై హత్యాయత్నం చేసి,తిరిగి వైఎస్సార్సీపీపైనే తప్పుడు నిందలు మోపడం సిగ్గుచేటన్నారు.శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారి విలువలను రోడ్డున పడేశారని విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిప డ్డారు. ఈ రెండున్నరేళ్లలో ఒక్క మహిళకైనా నెలకు రూ.1,500 ఇచ్చారా? నిరుద్యోగ భృతి ఏమైంది? మీ సూపర్-6 హామీలు ఎక్కడికి పోయాయి?"అని ప్రశ్నించారు. పాలనా వైఫల్యాలను అసమర్థతను కప్పిపుచ్చుకోవ డానికే 24 గంటలూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు,చౌకబారు విమర్శలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.ప్రజల్లోకి జగన్ వెళితే ప్రభంజనం వస్తోందని,ప్రభుత్వం చేసే తప్పుడు విమర్శలను ప్రజలెవరూ నమ్మరని తేల్చిచెప్పా రు. రాష్ట్రాన్ని తండ్రీకొ డుకులు, నియోజకవర్గాలను కూటమి ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. పులివెందుల మెడికల్ కాలేజీ సీట్లను వెనక్కు పంపి స్థానిక యు వతకు అన్యాయం చేసిన దుర్మార్గమైన చరిత్ర చంద్రబా బుదని మండి పడ్డారు.అమరావతిలో నిర్మిం చతలపె ట్టిన 40 లక్షల చదరపు అడుగుల సచివాలయం, వందల అంతస్తుల భవనాలు ప్రజా సంక్షేమం కోసం కాదని కేవలం కమీషన్లు,దోపిడీ కోసమేనని ఆరోపించారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఏపీ ఇంటర్ బోర్డు ఏడీ దుర్గాప్రసాద్

- ఆలయ ఈవో యం.రామక్రిష్ణ



నంద్యాల, అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసి యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు విద్యాశాఖ సహాయ సంచాలకులు (అసిస్టెంట్ డైరెక్టర్) దుర్గాప్రసాద్ సోమవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికార సిబ్బంది అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అర్చనలు, అభిషేకములు, విశేష పూజలునిర్వహించారు.అనంతరం ఆశీర్వ మంటపము నందు వారికి శేష వస్త్రములతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేసి ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కూటమి నాయకులకు జనసేన పార్టీ నేతలకు నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

- నంద్యాల జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు



నంద్యాల అక్టోబర్ 19(నేటి మినిట్ టు మినిట్): విజయదశమి పండుగ చెడు పై మంచి సాధించిన విజయం ఈ పండుగకు ప్రతీక అని ప్రతి ఒక్కరూ ధైర్యం, నమ్మకం, నిజాయితీ, న్యాయం మార్గంలో ముందుకు సాగాలని జనసేన పార్టీ నాయకులు మారాసు గురుబాబు సూచించారు. ప్రతి ఇంటిలో ఐకమత్యం, ప్రేమాభిమానాలు పెరగాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. చిన్నారులకు ఈ పండుగ యొక్క చారి త్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలియజేయాలని తల్లిదండ్రులను కోరారు. పేద ధనిక తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా జరుపు కునే ఈ దసరా పండుగ, ప్రజల్లో ఆనందాన్ని, ఐక్యతను కలిగిస్తుం దని అన్నారు. దేవీ మాత కటాక్షంతో ప్రజలందరికీ ఆయురా రోగ్యా లు, ఐశ్వర్యం కలగాలని, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలని మారాసు గురుబాబు తెలిపారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.